పాస్‌పోర్టు స్లాట్లకు డిమాండ్

గతంలో వారంలోగా లభ్యం... ప్రస్తుతం 20 రోజుల సమయం

- ఇతర జిల్లాల నుంచి దరఖాస్తుల వెల్లువ
- సాఫ్ట్‌వేర్ 2.0 వెర్షన్ అప్‌డేట్ నేపథ్యంలో స్లాట్లు కేటాయింపు, వెరిఫికేషన్ ఆలస్యం
- త్వరలో అరకులోయ పోస్టాఫీస్‌లో పీఎస్‌కే

- వార్త 7వ పేజీలో..

బదిలీలకు బ్రేక్

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మళ్లీ పాత మండలాలకే తహసీల్దార్లు

- కోడ్ ముగిశాక ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ



(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లా రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీలపై నెలకొన్న అనిశ్చితి ఎట్టకేలకు తొలగిపోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌కు ముందు బదిలీలపై పాత స్థానాలకు వచ్చిన తహసీల్దార్లను వెనక్కి పంపేశారు. కోడ్ ముగిశాక ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ చేపడతామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల ముందు జిల్లా నుంచి విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలకు బదిలీపై వెళ్లిన 24 మంది తహసీల్దార్లను ఇటీవలే జిల్లాకు కేటాయించారు. ఇతర జిల్లాల నుంచి ఎన్నికల ముందు వచ్చి జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు సొంత జిల్లాకు వెళ్లిపోయారు. పది రోజుల కిందట 24 మంది తహసీల్దార్లు కలెక్టర్ విజయకృష్ణన్‌కు రిపోర్టు చేసి, ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటున్నారు. వారికి బదిలీలు, మండలాల కేటాయింపుల ప్రక్రియ ముందుకు సాగలేదు. వాస్తవానికి కలెక్టర్‌కు రిపోర్టు చేసిన తహసీల్దార్లను మండలాలకు వారం రోజుల్లోగా కేటాయించాల్సి వుంది. కానీ 13 రోజులు కావస్తున్నా వారికి మండలాలు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో కొందరు తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో నేతలతో అంటకాగిన కొందరు తహసీల్దార్లు మళ్లీ తమకు కావాల్సిన చోట పోస్టింగుల కోసం పైరవీలు మొదలుపెట్టారు. ఈ విషయం కూటమి ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో తహసీల్దార్ల బదిలీల విషయంలో మార్గదర్శకాలు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆరోపణలు ఎదుర్కొన్న తహసీల్దార్లను గతంలో వారు పనిచేసిన పాత మండలాకు నియమించరాదని, అదేవిధంగా సొంత రెవెన్యూ డివిజన్‌లలో తహసీల్దార్లను నియమించవద్దని ప్రభుత్వం వారం రోజుల కిందట స్పష్టం చేసింది. జిల్లాలో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ జరపవద్దని, అయితే ఇప్పటికే రిపోర్టు చేసిన 24 మంది తహసీల్దార్లకు ఎన్నికల ముందు వారు పనిచేసిన మండలాల్లో బాధ్యతలు నిర్వహించేలా వెసులుబాటు కల్పించింది. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లాలో 24 మండలాలకు ఎన్నికల ముందు వరకు పనిచేసిన తహసీల్దార్లను మళ్లీ పంపేందుకు నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సీసీఎల్ఏ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 24 మంది తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ జరపనున్నారు. తహసీల్దార్ల బదిలీల విషయంపై కలెక్టర్ విజయకృష్ణన్‌ను వివరణ కోరగా ఎన్నికల కోడ్‌కు ముందు తహసీల్దార్లు రిపోర్టు చేశారని, అయితే మండలాలకు కేటాయింపుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. కోడ్ అమలులో ఉన్నందున ప్రస్తుతం ఖాళీగా వున్న తహసీల్దార్లను పాత మండలాల్లో విధులు నిర్వహించాలని సూచించామని పేర్కొన్నారు. కోడ్ ముగిసిన తరువాత ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తహసీల్దార్ల బదిలీలు, మండలాల కేటాయింపుల ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కాలువల ప్రక్షాళనకు కదిలిన రైతన్న

- సాగునీటి కోసం అన్నదాతల అవస్థలు
- జల వనరుల శాఖాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం
- బెన్నవోలు, పెద్దేరు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టిన రైతులు
- నిధులు విడుదల చేయాలని కూటమి ప్రభుత్వానికి వేడుకోలు

తుప్పలు, చెత్తాచెదారంతో పూడుకుపోయిన సాగునీటి కాలువలు

- పూడికతీతకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయని గత వైసీపీ ప్రభుత్వం



కాలువలో పెరిగిపోయిన తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

చోడవరం, ఆగస్టు 8:

సాగునీటి కాలువలు పూడుకుపోయాయి. తుప్పలు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం కనీసం పూడికలు తీయించకపోవడం, సాగునీటి వనరుల నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జలవనరుల శాఖ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా పొలాలకు సాగునీరు అందేలా చూడాలని నిర్ణయించుకున్నారు. పలుగు, పార పట్టుకుని రైతులు స్వచ్ఛందంగా సాగునీటి కాలువల్లో పూడికలు తీసుకుంటున్నారు. అధికారులు కనీసం కాలువల నిర్వహణకు కొంత మొత్తం అయినా నిధులు విడుదల చేస్తే తమకు మరింత వెసులుబాటుగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

సాగునీటి వనరులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. మండలంలోని పలు గ్రామాల్లోని సుమారు మూడు వేల ఎకరాల భూములకు సాగునీరు అందించే సాగునీటి కాలువలు గత ప్రభుత్వ



బెన్నవోలు ఆవ కాలువలో పూడిక తొలగిస్తున్న రైతులు

హయాంలో ఉదాసీనత కారణంగా పూడుకుపోయాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. సాగునీటి కాలువల ద్వారా నీరు వచ్చే దారిలేకపోవడంతో గత కొంతకాలంగా జన్నవరం పరిధిలోని రైతాంగం జలవనరుల శాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా, కాలువల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో కాలువల్లో విపరీతంగా తుప్పలు బలిసిపోయి పూడిక పెరిగిపోయి వ్యవసాయానికి సాగునీరు అందని దుస్థితి ఏర్పడింది. కాలువలు బాగు చేసి సాగునీరు అందించాలంటూ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు, చివరకు కాలువలో తుప్పలు, పూడిక తొలగించి సాగునీటి కాలువలు బాగు చేసుకునేందుకు రంగంలో దిగారు.

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

మండలంలోని ఏటవతల పంచాయతీలైన జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెం ... మిగతా 8వ పేజీలో

సాగునీటి కాలువలను బాగు చేయించాలి

మా పంట భూములకు సాగునీరు అందించే కాలువలు బాగు చేయించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి విసిగిపోయాం. కాలువలో పూడిక తీయడానికి మా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, కాలువల్లో బెన్నవోలు ప్రాంతం నుంచి మురుగునీరు కూడా పారుతుండడంతో కాలువల్లో దిగి పూడిక తీయడం చాలా కష్టంగా ఉంది. మురుగునీటితో పాటు, చెత్తాచెదారం, గాజు సీసా పెంకులు నిండిపోయి ఉండడంతో కాలువల్లో దిగడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. సాగునీటి కోసం ముక్కు మూసుకుని బాగు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం సాగునీటి కాలువలకు నిధులు మంజూరు చేసి అన్నదాతల కష్టాలు తీర్చాలని కోరుకుంటున్నాం.

- సాలాపు నరసింహమూర్తి, రైతు, జన్నవరం

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

- పునర్నిర్మాణం కోసం కూల్చివేత
- విద్యార్థులు జడ్పీ హైస్కూల్‌కు తరలింపు
- గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద పునాదులు తీసి వదిలేసిన వైనం
- కనీస వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వం పాఠశాల భవనాలను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన

హుద్‌హుద్‌కు దెబ్బతిన్న ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలు



నాడు- నేడులో భాగంగా వేసిన పునాదులు

ఎలమంచిలి, ఆగస్టు 8:

సుమారు వందేళ్ల చరిత్ర గల ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇప్పుడు దయనీయ స్థితిలో ఉంది. ఇక్కడ చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. రాజకీయ ప్రముఖులుగా, జాతీయ క్రీడాకారులుగా ఎదిగారు. ఇంతటి ప్రాధాన్యత గల ఈ పాఠశాల భవనాలు హుద్‌హుద్ తుఫాన్‌కు దెబ్బతింటే పునర్నిర్మాణం కోసం కూల్చివేశారు. ఇక్కడి విద్యార్థులను జడ్పీ హైస్కూల్‌కు తరలించారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద తరగతి గదులు నిర్మించడానికి పునాదులు తీసి వదిలేసింది. దీంతో ఘన చరిత్ర గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల కనుమరుగై పోయింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ పాఠశాల భవనాలను పునర్నిర్మించాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

పట్టణంలో 1926లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నిర్మించారు. దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు, మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు, జిల్లా మాజీ క్రీడాభివృద్ధి అధికారి నగిరెడ్డి సూర్యారావు, ఎందరో జాతీయ స్థాయి హాకీ, ఫుట్‌బాల్ క్రీడాకారులు, కోచ్‌లు ఈ పాఠశాలలో చదువుతున్నారు. ఈ పాఠశాల భవనాలు 2014 అక్టోబర్‌లో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్‌కు దెబ్బతిన్నాయి. ఇక్కడి విద్యార్థులను రైల్వే స్టేషన్ రోడ్డులో



భవనాలు తొలగించిన చోట పెరిగిన తుప్పలు

ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాల్లోకి తరలించారు. అప్పట్నుంచి ఒకే చోట రెండు స్కూళ్లను నిర్వహిస్తున్నారు. దీని వల్ల వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పునాదులు తీసిన కాంట్రాక్టర్ బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశాడు. దీంతో అప్పటి నుంచి పునాదుల స్థాయిలోనే దర్శనమిస్తోంది. పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదవ తరగతి వరకు అప్పట్లో ఆరు వందల మంది విద్యార్థులు ఉండేవారు. జడ్పీ హైస్కూల్‌కు విద్యార్థులను తరలించడంతో ఈ పాఠశాల విద్యార్థులు గత ఏడాది 108 మందే మిగిలారు. కూటమి ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను పునర్నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మేయర్ పీఠంపై గురి!

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయంతో కూటమి నేతల్లో ఉత్సాహం

- మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం
- నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యేంత వరకూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదన్న చట్టానికి సవరణ చేయాలని ప్రభుత్వ పెద్దలకు వినతి
- వచ్చే మంత్రిమండలి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం



- మేయర్ మార్పు ఖాయమంటున్న టీడీపీ కార్పొరేటర్లు
- త్వరలో మరో వైసీపీ నుంచి మరో 15 మంది వరకూ జంప్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నేతల్లో ఉత్సాహం నింపింది. మూడున్నరేళ్లుగా స్టాండింగ్ కమిటీలో ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం లేదనే నిరుత్సాహంతో ఉన్న నేతలు...ఇప్పుడు కమిటీలోని పది స్థానాలను కైవసం చేసుకున్నారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యంగా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. కౌన్సిల్‌లో పూర్తిస్థాయి మెజారిటీ సంపాదించడంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వీలుగా చట్టసవరణ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈసారి జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారుల్లో ప్రచారం జరుగుతోంది.

మూడున్నరేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 59 వార్డులను దక్కించుకోవడంతో జీవీఎంసీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండడంతో ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురితోపాటు టీడీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన ముగ్గురు వైసీపీలో చేరిపోయారు. దీంతో జీవీఎంసీలో వైసీపీ తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. అప్పటి నుంచి మూడుసార్లు జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అన్ని స్థానాలను వైసీపీ కార్పొరేటర్లే గెలుచుకుంటూ వచ్చారు. స్టాండింగ్ కమిటీతోపాటు కౌన్సిల్ సమావేశాల్లో కూడా వైసీపీ నేతలు తాము అనుకున్న అంశాలను ఎజెండాలో చేర్చి విపక్షాల అభ్యంతరాలను పట్టించుకోకుండా అడ్డగోలుగా ఆమోదింపజేసుకునేవారు. కానీ రెండు నెలల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో జీవీఎంసీలో రాజకీయసమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. వైసీపీ నుంచి కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి టీడీపీ, జనసేనలో చేరిపోవడం మొదలుపెట్టారు. కౌన్సిల్ ఏర్పడినప్పుడు 65 మంది కార్పొరేటర్లు కలిగిన వైసీపీ బలం బుధవారం స్టాండింగ్ కమిటీ ఎన్నికల సమయానికి 43కి తగ్గిపోయింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో పోటీ చేసిన తమ పార్టీ అభ్యర్థులకు 43 ఓట్లు కచ్చితంగా పడతాయని భావించిన వైసీపీ నేతలకు ఫలితాలు వెల్లడి తర్వాత దిమ్మతిరిగిపోయింది. ఎన్నిక జరడానికి ముందురోజు ఆ పార్టీ ఏర్పాటుచేసిన శిబిరంలో 43 మంది పాల్గొంటే, వైసీపీ నుంచి పోటీ చేసిన ఒక అభ్యర్థికి కేవలం 21, మరొకరికి 25 ఓట్లు మాత్రమే ... మిగతా 8వ పేజీలో

డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం తరలింపునకు రంగం సిద్ధం

- రిజర్వ్ బ్యాంకు నుంచి అనుమతి
- రామారావుపేటలోని పీఏసీఎస్ భవనంలోకి మార్పు

నర్సీపట్నం, ఆగస్టు 8 : అద్దె భవనంలో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నర్సీపట్నం బ్రాంచ్ కార్యాలయాన్ని నర్సీపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలోకి తరలించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మునిసిపాలిటీ పరిధి ఎనిమిదో వార్డు రామారావుపేటలో పీఏసీఎస్ భవన నిర్మాణానికి రూ.8 లక్షలు ఆప్కాబ్ నిధులు మంజూరు చేయగా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.42 లక్షలు రుణం ఇచ్చింది. 2021 డిసెంబరులో శంకుస్థాపన చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం, పైఅంతస్థులో పీఏసీఎస్ ఆఫీసు నిర్మించారు. 2023 నవంబరులో భవనం ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. పైఅంతస్థులోకి పీఏసీఎస్ కార్యాలయాన్ని తరలించారు. రిజర్వ్ బ్యాంకు అనుమతి ఇవ్వకపోవడంతో డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాన్ని గత పది నెలలుగా తరలించడానికి వీలు పడలేదు. తాజాగా వారం రోజుల క్రితం రిజర్వ్ బ్యాంకు నుంచి కార్యాలయం తరలించడానికి అనుమతి వచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో అద్దె ఒప్పంద పత్రం రాసుకొని పంపాలని సీఈఓకి ఆదేశాలు జారీ చేసింది. ఈ వారంలో పీఏసీఎస్‌తో అద్దె ఒప్పందం పూర్తి చేసి నెల రోజుల్లో కార్యాలయాన్ని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా శ్రీకన్య థియేటర్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రైవేటు భవనంలో మూడు దశాబ్దాలకు పైగా డీసీసీబీ నర్సీపట్నం బ్రాంచ్ కార్యాలయం నడుపుతున్నారు. బ్యాంకులో 20,400 మంది ఖాతాదారులతో రూ.113 కోట్లు టర్నోవర్ ఉంది.



డీసీసీబీ అద్దె భవనంలో నిర్వహిస్తున్న దృశ్యం

పకడ్బందీగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



హాజరైన వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధి కారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 15న ఉదయం 9 గంటల నుంచి జరిగే వేడుకలకు స్టేజ్ అలంకరణ, సీటింగ్, స్టాల్స్ ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు పనులు చేపట్టే విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాల గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించి సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, ఇన్‌చార్జి డీఆర్వో వైశ్రీనివాసరావు, ఆర్డీవో చిన్ని కృష్ణ, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

తమ్ముడిపై హత్యాయత్నం

» ఇల్లు ఖాళీ చేయాలంటూ చాకుతో దాడి

» పెదగుమ్ములూరులో ఘటన

ఎస్.రాయవరం, ఆగస్టు 8: ఇల్లు ఖాళీ చేయాలంటూ తమ్ముడిపై అన్న చాకుతో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని పెదగుమ్ములూరులో చోటుచేసుకొంది. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన కట్టా అప్పారావు, కట్టా సుబ్బారావు అన్నదమ్ములు. వీరికి ఉన్న ఇంటిలో రెండు గదులండగా ఇద్దరూ తమ కుంటుంబాలతో చెరో గదిలో నివాసం ఉంటున్నారు. అన్నదమ్ములిద్దరిలో పెద్దవాడైన అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేయడానికి వెళ్లి అప్పుడప్పుడు ఇంటికి వస్తుంటాడు. అప్పారావు ఇంటికి వచ్చినప్పుడల్లా తమ్ముడైన సుబ్బారావును ఇల్లు ఖాళీ చేయాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఎప్పటి వలె పనికి వెళ్లి వచ్చిన అప్పారావు గురువారం ఇంట్లో నిద్రిస్తున్న తన తమ్ముడు సుబ్బారావుపై కూరగాయలు కోసే చాకుతో దాడి చేయడంతో మెడపై గాయమైంది. దీంతో చుట్టుపక్కల వారు రావడంతో సుబ్బారావు ప్రాణాలతో బయటపడ్డాడు. గాయపడిన సుబ్బారావును నక్కపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.


చికిత్స పొందుతున్న సుబ్బారావు

పురుగుల మందు తాగి ఆత్మహత్య

సబ్బవరం, ఆగస్టు 8 : మండలంలోని మలునాయుడుపాలెం గ్రామంలో పురుగులు మందు తాగి గురువారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మలునాయుడుపాలెం గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ (54) కొన్నేళ్లుగా దీర్ఘకాలిక రోగంతో బాధపడుతూ మానసికంగా వ్యథ చెందుతున్నాడన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆందోళనకు గురై పురుగులు మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యుల విశాఖపట్నంలోని ఒక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడు కుమారుడు మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


పైల సత్యనారాయణ (ఫైల్)

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

సబ్బవరం, ఆగస్టు 8 : పాత గంజాయి కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. 2022 జూలై 14వ తేదీన అనకపల్లి ఫ్లైఓవర్ వద్ద 100 కేజీల గంజాయి, 8 కిలోల లిక్విడ్‌తో జి.మాడుగుల ఏజెన్సీ ప్రాంతం నుంచి కేరళ తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో అప్పుడు ఆరుగురుని అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో ఇద్దరు తప్పించుకుపోయారని, వారిలో ఒక వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ కేసులో మరొక వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి

సబ్బవరం/కె.కోటపాడు, ఆగస్టు 8 : సబ్బవరంలో మూడుళ్లుగా ఏఎస్ఐగా పనిచేస్తున్న జి. రామునాయుడు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కోటపాడు మండలం వెలంపాలెంకు చెందిన జి. రామునాయుడు 2021లో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందు తూ బుధవారం రాత్రి మృతి చెందారు. వెలంపాలెంలో పోలీస్ లాంఛనాలతో గురువారం అంత్యక్రియలు నిర్వహించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మృతి చెందిన రామునాయుడుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియల్లో ఎస్ఐ ధనుంజయ్, సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.


రామునాయుడు (ఫైల్)

పాస్‌పోర్టు స్లాట్లకు డిమాండ్

» గతంలో వారంలోగా లభ్యం... ప్రస్తుతం 20 రోజుల సమయం

» ఇతర జిల్లాల నుంచి దరఖాస్తుల వెల్లువ

» త్వరలో అరకులోయ పోస్టాఫీస్‌లో పీఎస్‌కే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పాస్‌పోర్టు స్లాట్లకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. గతంలో నెల రోజులకు గానీ స్లాట్ దొరకడం లేదని గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టి వారం రోజుల్లోనే స్లాట్ దొరికేలా చేశారు. అయితే ఇప్పుడు మళ్లీ 15 రోజులు ఆగితే గాని స్లాట్ లభించడం లేదు. విదేశాంగ శాఖ పాస్‌పోర్టుల జారీ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకుంటూ వస్తోంది. ప్రస్తుతం వెర్షన్ 2.0 అప్‌డేట్ చేస్తున్నారు. ఎక్కడైతే ఈ సాఫ్ట్‌వేర్ ప్రాసెస్‌లో ఉందో అక్కడ పాస్‌పోర్టుల స్లాట్లు, వెరిఫికేషన్, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దాంతో ఆ ప్రాంతానికి చెందినవారు ఎక్కడ స్లాట్ దొరికితే ఆ జిల్లాకు వెళ్లి వివరాలు సమర్పిస్తున్నారు.

విశాఖపట్నం పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయం పరిధిలో నగరంలోని బొత్స స్క్వేర్‌తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, ఎలమంచిలి, కాకినాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, కాకినాడల్లోని జిల్లా హెడ్ పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఏర్పాటుచేశారు. అలాగే భీమవరంలో లఘు కేంద్రం నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలో రోజుకు 410 వరకు స్లాట్లు కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఎవరైనా ఇక్కడ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇరవై రోజుల వ్యవధిలో స్లాట్ దొరుకుతోంది. అయితే గుంటూరుతో పాటు మరికొన్ని జిల్లాలలో తక్కువ సమయంలో స్లాట్ అందుబాటులో లేకపోవడంతో వారు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పోస్టాఫీసు కేంద్రాలకు వస్తున్నారు. అదేవిధంగా ఒడిశా నుంచి కూడా చాలామంది ఇక్కడ దరఖాస్తు చేసుకుంటున్నారు. అక్కడ కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నందున ఇక్కడికి వస్తున్నారని పాస్‌పోర్టు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

6 నెలల సెలవులో అధికారిణి

విశాఖపట్నం పాస్‌పోర్టు ఆఫీసర్ బుధవారం నుంచి ఆరు నెలల మెటర్నటీ లీవులో వెళ్లారు. అసిస్టెంట్ పాస్‌పోర్టు అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు గ్రాంటింగ్ ప్రక్రియ కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. అధికారుల సంఖ్య తగ్గడం వల్ల అన్నీ పరిశీలించి చూసుకోవలసి ఉంటుందని చెబుతున్నారు.

అరకులోయ పోస్టాఫీసులో పీఎస్‌కే?

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రజలకు పాస్‌పోర్టు కేంద్రం అందుబాటులో లేదు. వారు విశాఖపట్నమో, ఎలమంచిలో వెళ్లాల్సి వస్తోంది. గతంలో అరకులోయ ఎంపీగా పనిచేసిన వారు ఓ సేవా కేంద్రం పెట్టాలని కోరడంతో అధికారులు ప్రాసెస్ ప్రారంభించారు. ట్రయల్ విధానంలో అరకులోయలో పోస్టాఫీసు సేవా కేంద్రం పెట్టాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది.

ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో నూతన పీజీ కోర్సు

ఎలమంచిలి, ఆగస్టు 8: ఎలమంచిలి ప్రభుత్వ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి అనలిటికల్ కెమిస్ట్రీ పీజీ కోర్సును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ పీజీ కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో చేరాలంటే ఏపీ పీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. త్వరలో ప్రారంభకానున్న కౌన్సెలింగ్‌లో ఆప్షన్‌ను నమోదు చేసుకొని ఈ కళాశాలలో చేరవచ్చునన్నారు. ఈ పీజీ కోర్సులో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

వైసీపీ పాలనలో అలా.. కూటమి ప్రభుత్వంలో ఇలా..

అందంగా రూపుదిద్దుకున్న అన్న క్యాంటీన్ భవనం


వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన అన్న క్యాంటీన్ భవనం (ఫైల్)



ప్రస్తుతం అందంగా తయారైన రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ భవనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా తయారైన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లో అందంగా తయారయ్యాయి. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్కువ డబ్బులతో పేదల ఆకలిని తీర్చాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోను, రైల్వేస్టేషన్ వద్ద జీవీఎంసీ స్థలంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు నిలిచిపోయాయి. కనీసం భవనాలు కూడా ఏదొక విభాగాన్ని వినియోగించాలన్న ఆలోచన చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్టీఆర్ వైద్యాలయంలోని అప్పట్లో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ భవనాన్ని ల్యాబ్‌గా మార్చి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అనకాపల్లి జిల్లాగా ఏర్పడింది. అయితే ఎక్కడా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే చాలా వరకు పాలన సాగింది. ఈ ఐదేళ్లలో కూడా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పాత అన్న క్యాంటీన్ భవనాన్ని శుభ్రంగా తయారు చేసి ఏదో ఒక విభాగానికి కేటాయించి వినియోగించకపోవడంతో భవన అధ్వానంగా మారింది. పరిసరాల్లో తుప్పలు బలిసిపోయాయి. చీకటి పడితే మందుబాబులకు ఆవాస కేంద్రంగా మారిందన్న ప్రచారం కూడా సాగింది. అయితే రెండు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అధ్వానంగా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పాత అన్న క్యాంటీన్ భవనానికి మోక్షం లభించింది. జీవీఎంసీ అధికారులు రూ.11 లక్షలతో రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్ భవనాన్ని ఆధునికీకరించి సుందరంగా తీర్చిదిద్దారు. వైసీపీ పాలనలో అధ్వానంగా ఉన్న భవనానికి ప్రస్తుతం అభివృద్ధి చెందిన భవనాన్ని చూస్తే ఎంత తేడా ఉందోనని స్థానికులు పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, ఆగస్టు 8: నీటి పారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీని వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఆయన మర్లగుమ్మి ఆనకట్టను ఇరిగేషన్‌శాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడు, ఏఈఈ సీహెచ్ జయరాంపడాల్, నీటి సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. మర్లగుమ్మి ఆనకట్ట షట్టరు, పక్కన ఉన్న గోడ కూలిపోయిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జలాశయాల మరమ్మతు పనులను వెంటనే చేయించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించి దానికి తగిన నిధులు కూడా కేటాయించారని తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో ఉన్న జలాశయాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఈ ప్రతిపాదనలను నీటి పారుదలశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళతామన్నారు. రైవాడ జలాశయం మరమ్మతులకు గత ప్రభుత్వం రూ.22 కోట్లు కేటాయించినా, దీనిలో రూ.5 కోట్లు పనులు చేసినా కాంట్రాక్టర్‌కి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలుపుదల చేశారన్నారు. ఆ బిల్లులు చెల్లించి మిగతా పనులు అయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. జలాశయాల్లో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కరించి ప్రతిరైతుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.


మర్లగుమ్మి ఆనకట్టను పరిశీలిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు

యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లకు అందని వేతనాలు

» నాలుగు నెలలుగా నిలిపివేత » ఇబ్బంది పడుతున్న శిక్షకులు

» ఆయుష్‌శాఖాధికారుల చిన్నచూపు

నక్కపల్లి, ఆగస్టు 8: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, గ్రామస్థులకు యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటిపై శిక్షణ ఇచ్చేందుకు నియమించిన యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. వీరిని 2022 మార్చి నెలలో ఆయుష్ శాఖ నియమించింది. మేల్ యోగా గెస్ట్ ఇన్‌స్ట్ర క్టర్లకు నెలకు 32 గంటలు, ఫీమేల్‌కు నెలకు 20 గంటలు చొప్పున యోగా శిక్షణ ఇవ్వాలనే షరతు విధించారు. వీరు చెప్పే ప్రతి గంటకు రూ.250 చొప్పున 32 గంటలకు పురుషులకు నెలకు రూ. 8,000, మహిళాలకు నెలకు రూ.5000 చొప్పున నిర్ణయించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 8 ఆయుర్వేద డిస్పెన్సరీలు వున్నాయి. మధురవాడ, సింహాచలం, అనకాపల్లి, కొరుప్రోలు, ఎం.కోడూరు, నర్సీపట్నం, కర్నూలుపాలెం, వేంపాడు డిస్పెన్సరీల పరిధిలో 15 మంది పురుష, మహిళా యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. వీరు ఏ పాఠశాలలో విద్యార్థులకు యోగా నేర్పుతున్నారో అక్కడ ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే వారు చెప్పిన గంటలకు వేతనం వచ్చేది. ఇందులో చాలా మార్పులు చేయడంతో యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ట్రాన్స్‌పోర్టు చార్జీలు అధికమయ్యేవి. వీరికి ఇచ్చే వేతనంలో చాలా మేరకు రవాణా ఖర్చులు అయ్యేవి. అయినా యోగా తరగతులు నిర్వహించడంలో వీరు ఎప్పుడూ అలసత్వం ప్రదర్శించలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లకు వేతనాలు ఇవ్వలేదు. దీంతో వీటిపైనే ఆధారపడ్డ యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యోగా అటెండెన్స్, ఇతర వ్యవహారాలను మోనటరింగ్ చేసే ఆయుష్ ప్రధాన కార్యాలయంలోని అధికారులను ఫోన్లో సంప్రదిస్తే వారిపై రుసరుసలాడుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ దీనస్థితిని అర్థం చేసుకుని, బకాయి వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. తమ దీనస్థితిపై మంత్రులు లోకేశ్, పవన్ కల్యాణ్, వంగలపూడి అనితలను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లు అంటున్నారు.


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సెజ్‌లో ఎలక్ట్రానిక్ కర్మాగారానికి స్థలం కేటాయింపు

» ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాదరావు

అచ్యుతాపురం, ఆగస్టు 8: అచ్యుతాపురం సెజ్‌లో ఎలక్ట్రానిక్ కర్మాగారానికి భూమిని కేటాయించామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'సెజ్‌లో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు నిల్' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు.. సబ్‌స్ట్రేట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కర్మాగారం ఏర్పాటుకు సెజ్‌లో ప్లాట్ నంబర్ 40, 41లో 20.05 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ 2024 జూలై పదో తేదీన జరిగిందన్నారు. దీనికి 2024 అక్టోబరులో భూమిపూజ జరగనుందన్నారు. ఈ కర్మాగారంలో పవర్డ్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఏక్సిసీరీస్, స్మార్ట్‌హోం టెక్నాలజీ, బిల్డింగ్ టెక్నాలజీ, బిల్డింగ్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంతవరకు సాఫ్ట్‌వేర్ కర్మాగారాలకు సెజ్‌లో అనుమతులు ఇవ్వలేదని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాదరావు పేర్కొన్నారు.

ఇసుక డోర్ డెలివరీ

త్వరలో రీచ్‌ల నుంచి నేరుగా ఇంటికే సరఫరా

» కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీలు

» మరింత తగ్గనున్న ధర

» భీమిలి, అగనంపూడిల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు అయిపోయిన తరువాత » డిపోలు ఎత్తివేత

» శ్రీకాకుళం జిల్లాలో ఒక రీచ్ పూర్తిగా విశాఖ జిల్లా అవసరాలకు కేటాయించాలని అధికారుల ప్రతిపాదన

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరంలో ఇసుక డోర్ డెలివరీకి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లుచేస్తోంది. శ్రీకాకుళం/రాజమండ్రిల్లో గల రీచ్‌ల నుంచి నేరుగా వినియోగదారుడి ఇంటికి చేరేలా ప్రణాళిక రూపొందిస్తుంది. ప్రస్తుతం నగర పరిధిలో గల భీమిలి, అగనంపూడిల్లో ఉన్న ఇసుక డిపోలను ఎత్తివేయనున్నారు.

విశాఖ నగర పరిధిలో నిర్మాణాలకు నెలకు సగటున 30 నుంచి 35 వేల టన్నుల ఇసుక అవసరం. ఇసుక అవసరమైనవారు తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తే...రెండు, మూడు రోజుల వ్యవధిలో నేరుగా ఇంటికే వాహనం ద్వారా పంపనున్నారు. దీని కోసం శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేకంగా ఒక రీచ్‌ను విశాఖ జిల్లాకు కేటాయించేలా చూడాలని ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం భీమిలి, అగనంపూడి డిపోల్లో ఉన్న ఇసుక అమ్మకాలు పూర్తయిన తరువాత డోర్ డెలివరీ విధానం అందుబాటులోకి తీసుకురానున్నారు. డోర్ డెలివరీ విధానం వల్ల ప్రస్తుతం ఉన్న రేటు మరింత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. రీచ్‌ల నుంచి వినియోగదారుడి ఇంటికి ఇసుక తీసుకువచ్చేందుకు కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీలు నిర్ణయిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక డిపో నుంచి వినియోగదారుడి ఇంటికి రవాణాకు కిలోమీటరుకు ఇంత అని నిర్ణయించి చార్జీలు వసూలు చేసేవారు. ఈ విధానం గాడిలో పడే సమయంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో మొత్తం గందరగోళంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు నేరుగా నదుల్లోని రీచ్‌లు లేదా ఒడిశా నుంచి తెచ్చుకునేవారు. ఇదిలావుండగా విశాఖలో ప్రధాన నదులు లేనందున శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గోదావరి నదుల్లోని రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధానంలో గందరగోళం ఏర్పడడంతో టన్ను ఇసుక ఇంటికి చేరేసరికి రూ.1,600 నుంచి రూ.1,800 వరకు ఖర్చయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు ఏజెన్సీలు నదుల నుంచి తీసుకువచ్చిన ఇసుక ఎక్కువగా డిపోల్లో ఉండిపోయింది. ఈ విధంగా విశాఖ జిల్లాలో సుమారు రెండు లక్షల టన్నులు స్టాకు ఉన్నట్టు గుర్తించారు.

ఆ ఇసుకను కాంట్రాక్టర్లు నిర్ణయించిన రేటుకు విక్రయించాల్సి ఉంది. కానీ, కొత్త ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకురావడంతో అగనంపూడి డిపోలో టన్ను రూ.1,394, భీమిలిలో రూ.758 చొప్పున విక్రయాలు చేపట్టారు. తరువాత రెండు డిపోల మధ్య రేటు తేడాను సరిచేసి రూ.1,076గా ఖరారు చేశారు. భీమిలిలో మరో పది వేల టన్నుల వరకు ఇసుక నిల్వలు ఉండగా, అగనంపూడిలో సుమారు 50 వేల నుంచి 60 వేల టన్నులు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. రెండు డిపోల్లో ఇసుక పూర్తిగా అమ్మేసిన తరువాత వాటిని మూసివేస్తారు. డిపోలతో పనిలేకుండా నేరుగా రీచ్‌ల నుంచి నిర్మాణదారుడి ఇంటికి డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించారు.

దీనివల్ల ప్రస్తుతం ఉన్న రేటు కంటే తక్కువకే ఇసుక లభించే అవకాశం ఉందంటున్నారు. దీనిపై గనుల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ చర్చించారు. విశాఖ జిల్లా వాసుల కోసం శ్రీకాకుళంలో ప్రత్యేకంగా ఒక రీచ్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేకంగా రీచ్ కేటాయిస్తే ఇప్పుడున్న రేటు కంటే తక్కువగా డోర్ డెలివరీ చేయవచ్చునని అంచనా వేస్తున్నారు.

తాండవలో పెరుగుతున్న నీటి నిల్వలు

» రైతుల ఆనందం

నాతవరం, ఆగస్టు 8: తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. రెండు రోజుల నుంచి తాండవ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తాండవలో నీటి నిల్వలు పెరుగుతుండడంతో తాండవ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 375 అడుగులకు నీటినిల్వలు చేరుకున్నాయి. ఇన్‌ఫ్లో ద్వారా 400 క్యూసెక్కుల నీరు వస్తుందని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. గత ఏడాది తాండవలో ఆగస్టు 8వ తేదీ నాటికి 369 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. గత జూలై నెల వరకు తాండవలో ఆశించినంత నీటి నిల్వలు లేక రైతులు ఆందోళన చెందగా, ప్రస్తుతం తాండవలో నీటి నిల్వలు 375 అడుగులకు చేరుకోవడంతో ఖరీఫ్ సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ రిజర్వాయర్‌లో 375 అడుగుల నీటి నిల్వలు ఉండడంతో తాండవ ఆయకట్టు రైతులు వరినారు సిద్ధం చేసుకుని తాండవ నీరు విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పల్లపు ప్రాంత రైతులు ఆగస్టు 15వ తేదీనే తాండవ నీరు విడుదల చేయాలని కోరుతుండగా, మెట్టప్రాంత రైతులు మాత్రం ఇంకా వరినారు ఎదగాలని ఆగస్టు 20వ తేదీ తర్వాతనే తాండవ నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.


తాండవలో 375 అడుగులకు చేరుకున్న నీటి నిల్వలు

జీవో 117 రద్దు తరువాతే ఉపాధ్యాయుల సర్దుబాటు

» యూటీఎఫ్ నేతల డిమాండ్

చోడవరం, ఆగస్టు 8: జీవో నంబర్ 117ను రద్దు చేసిన తరువాతే రాష్ట్రంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఎంఈవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా మారి, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని వాపోయారు. కూటమి ప్రభుత్వం సదరు జీవోను రద్దు చేయకుండానే ఉపాధ్యాయుల సర్దుబాటుకు పూనుకోవడం సరికాదన్నారు. ఈ జీవో రద్దు చేయకపోతే మెగా డీఎస్సీ నియామకాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ జీవోను రద్దు చేసి పాత జీవో 53 ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో తరగతులు నిర్వహించడం ద్వారా ప్రాథమిక విద్యావ్యవస్థను రక్షించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ మండల నాయకులు బొడ్డపాటి రామచంద్రరావు, నందికోళ్ల గణేశ్, ఉగ్గిన సత్యనారాయణ, బాబ్జీ, ఆరిపాక రాజారమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్, సంఘం నేతలు

రికార్డు స్థాయిలో పూల ధరలు

» శ్రావణమాసం రావడంతో పెరిగిన ధరలు

» కనకాంబరాలు కిలో రూ.3 వేలు

» చామంతులు రూ.400

నక్కపల్లి, ఆగస్టు 8: శ్రావణ మాసంలో నెల రోజులు పూజలు చేసే మహిళలు పూలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. శ్రావణమాసం రావడంతో పూల ధరలు బాగా పెరిగాయి. గురువారం జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట, అడ్డరోడ్డు మార్కెట్లలో పూల అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగాయి. గురువారం నాటికి కిలో కనకాంబరాల ధర రూ.3వేలు పలకగా, చామంతుల ధర కిలో రూ.400లకు చేరింది. మల్లెపూల ధరలైతే మూర రూ.100లకు విక్రయిస్తున్నారు. వచ్చే వారానికి చామంతుల ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ప్రాంత వర్తకులు కడియం తదితర ప్రాంతాల నుంచి పూలను కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. వీటి ధరలు పెరిగిపోవడంతో తాము కూడా పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని పూల వ్యాపారులు చెబుతున్నారు. శ్రావణమాసంలో వచ్చే శుక్రవారం రోజున లక్ష్మీదేవి అమ్మవారిని చామంతులతో పూజించడం పూర్వం నుంచి ఆచారంగా వస్తోంది. చామంతులతో పాటు, కనకాంబరాలను కూడా అమ్మవారికి అలంకరించిన అనంతరం వాటిలో కొన్ని పూలను మహిళా భక్తులు ధరిస్తారు. అందువల్ల పూల ధరలు చుక్కలను తాకుతున్నాయనే చెప్పాలి.


అనూహ్యంగా పెరిగిన కనకాంబరాల ధర

చట్టాల అధ్యయనం నిరంతర ప్రక్రియ

» ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

సబ్బవరం, ఆగస్టు 8 : చట్టాల అధ్యయనం నిరంతర ప్రక్రియ అని ఏపీ హైకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ సోమ యాజులు అన్నారు. గురువారం సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో నూతనంగా పీజీలో చేరిన విద్యార్థు లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టంలో జరిగే మార్పులను నిరంతరం గమనిస్తూ.. వాటిని అధ్యయనం చేసినప్పుడే విద్యార్థులు న్యాయవాద వృత్తిలో రాణించగలరన్నారు. కార్పొరేట్, మీడియేషన్ రంగాల్లో రాణించాలంటే వాటిలో మార్పులను అర్థం చేసుకోవాలని జస్టిస్ సోమయాజులు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యవర్తిత్వ రంగంలో ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయని, కానీ ఎక్కువగా లిటిగేషన్ వైపు రావలసిన అవసరం ఉందన్నారు. ట్రయల్ కోర్టులో ప్రాక్టీస్ చేసినప్పుడే ఒక నిపుణుడైన న్యాయవాదిగా రాణించగలరన్నారు. వీసీ డి. సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. న్యాయవాది వృత్తిలో అనేకమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను జస్టిస్ సోమయాజులు ప్రారంభించారు. జస్టిస్ సోమయాజలను వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందినీ సీపీ, అకాడమిక్ డీన్ సోమభట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జస్టిస్ సోమయాజులును జ్ఞాపికతో సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

పక్కాగా పశుగణన

▸ డివిజనల్ స్థాయి శిక్షణ శిబిరం ముగింపోత్సవంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి అగ్రికల్చర్, ఆగస్టు 8 : ఒంగోలు జాతి పశువులు, నెల్లూరు జాతి గొర్రెలు వంటి పశు సంపదలో ఆంధ్రప్రదేశ్ ఘనకీర్తి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జిల్లాలో చేపట్టనున్న పశుగణనపై డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు గురువారం విజయవంతంగా ముగిశాయి. ఈనెల ఆరో తేదీ మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఈ శిబిరాలు కొనసాగాయి. అనకాపల్లి, కశింకోట, అచ్యుతాపురం, మునగపాక, ఎలమంచిలి, రాంబిల్లి, చోడవరం, బుచ్చియ్యపేట, పరవాడ, పాయకరావుపేట, నాతవరం, కోటపాడు, దేవరాపల్లి, నక్కపల్లి, ఎస్.రాయవరం, సబ్బవరం మండలాల నుంచి ఎన్యూమరేటర్లు హాజరయ్యారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పశుగణనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పసు సంపద వృద్ధికి ఆయా పాడి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. జంతు సంక్షేమమే లక్ష్యంగా అంతా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఏసీహెచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

చేతులు పరిశుభ్రతతో వ్యాధులు దూరం

▸ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై పలు కార్యక్రమాలు
▸ సర్వశిక్ష అభియాన్ ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్

కశింకోట, ఆగస్టు 8 : చేతులు పరిశుభ్రత ద్వారా ఎనభై శాతం వరకు వ్యాధులు నియంత్రించవచ్చని సర్వశిక్ష అభియాన్ ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్ అన్నారు. గురువారం ఇక్కడి డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన డెటాల్ బనేగా స్వస్థ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు ఆయా పాఠశాలల్లో చేయాలన్నారు. సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం వల్ల క్రిములు, బాక్టీరియా, వైరస్‌లు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి, డీబీఎస్ఐ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఏఎస్ కుమారిలతో పాటు 55 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామల మృతిపై దర్యాప్తు జరపాలి

▸ మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో భర్త ఫిర్యాదు


డాక్టర్ శ్యామల మృతి వివరాలను మంగళగిరిలో కొణతాలకు వివరిస్తున్న భర్త నాగేశ్వరరావు

కశింకోట, ఆగస్టు 8 : మండలంలోని తాళ్లపాలెంలో గల పోలవరం కాలువలో అను మానాస్పదంగా మృతి చెందిన డాక్టర్ శ్యామల కేసుకు సంబంధించి దర్యాప్తు జరిపించాలని ఆమె భర్త బొడ్డేడ స్వామినాయుడు, జనసేన పార్టీ నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, గునబండి జాన్‌లు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు గురువారం మంగళగిరిలో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, న్యాయం చేయాలని పవన్‌కల్యాణ్ తరఫున అర్జీల స్వీకరణలో పాల్గొన్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కోరారు. 2020 ఆగస్టు 4న మృతి చెందిన శ్యామల ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన అర్జీని వారు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే కొణతాల స్పందించి శ్యామల మృతిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిన వైస్ ఎంపీపీ దేవి


దేవికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుందరపు

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 8 : మునగపాక వైస్ ఎంపీపీ చింతాడ దేవి గురువారం వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి చేరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆమెకు పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి పాలనలో మండలాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉన్నట్టు గుర్తించి జనసేన పార్టీలోకి చేరుతున్నట్టు ఆమె ప్రకటించారు. ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, నాయకులు టెక్కలి పరుశురాం, యల్లపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన 'ప్రగడ'


చంద్రబాబుతో ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్టు 8: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గురువారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు.

ఎస్.రాయవరం మండల సర్పంచుల సంఘం ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శిలను సత్కరిస్తున్న సర్పంచ్‌లు

ఎస్.రాయవరం, ఆగస్టు 8 : మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మేజర్ పంచాయతీ తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఎన్నికయ్యారు. గురువారం ఇక్కడ ఈ ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పెదఉప్పలం సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా వాకపాడు సర్పంచ్ షైలపల్లి శ్రీను, కార్యదర్శిగా ఉప్పరాపల్లి సర్పంచ్ సేనాపతి శ్రీరాములు, సహాయ కార్యదర్శిగా రామయ్యపట్నం సర్పంచ్ వైబోయిన పద్మ ఎన్నికయ్యారు. అలాగే, కోశాధికారిగా వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, సహాయ కార్యదర్శిగా పెనుగొల్లుసర్పంచ్ ఉద్దండ నాగ శ్రీదేవి, సభ్యులుగా గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీను, సర్వసిద్ధి సర్పంచ్ కురందాసు గణేష్‌లను ఎన్నుకున్నారు.

న్యాయ సహాయకుల సేవలకు దరఖాస్తులు

ఎలమంచిలి, ఆగస్టు 8 : మండల ప్రజలకు న్యాయపరమైన సలహాలతో సహాయం చేయాలనే సంకల్పం ఉన్నవారు న్యాయ సహాయకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎలమంచిలి మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, విద్యార్హత పత్రాలు, ఒక పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఒక స్టాంప్‌సైజ్ ఫొటో జత చేసి ఈ నెల 12వ తేదీలోపు మండల న్యాయసేవా అధికార సంస్థ కార్యాలయంలో అందజేయాల్సిందిగా కోరారు.

గవర జాతీయ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 : గౌరీ సంఘం ఆధ్వర్యంలో గవర జాతీయ పేద విద్యార్థులకు ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా ఉపకార వేతనాలు అందించనున్నామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణలు గురువారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ, ఈసెట్, ఇంజినీరింగ్, మెడిసిన్, నెట్ తదితర టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించిన అనకాపల్లి పరిసర ప్రాంత పేద విద్యార్థులు ఆ కోర్సుల్లో చేరిన వారికి ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. దరఖాస్తులను సెప్టెంబరు మూడో తేదీ లోపు సంఘ కార్యాలయంలో అందజేయాల్సిందిగా కోరారు. గతంలో ఉపకార వేతనాలు పొందిన వారు రెన్యూవల్ కోసం కూడా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అల్లరిమూకల ఆగడాలపై ఐద్వా ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదును అందిస్తున్న మాణిక్యం తదితరులు

పరవాడ, ఆగస్టు 8 : గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో అల్లరిమూకల బెడద అధికంగా ఉందని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక మహిళలతో కలిసి గురువారం పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో కొంతమంది యువకులు గత కొంతకాలంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకుంటూ మహిళలను, విద్యార్థినులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కారణంగా కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. కాలనీలో ప్రతి రోజూ పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు ఎస్.శ్రీదేవి, ఎల్.లక్ష్మి, ఎస్.వసంత, దేవీదుర్గా, బుజ్జి, సంతోషి, జి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి, ఆగస్టు 8 : మండల కేంద్రమైన నక్కపల్లి సహా ఉపమాక పంచాయతీ పరిధిలోని ఉపమాక, మామిడివానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపమాక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడనుందన్నారు.

అచ్యుతాపురం : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన అచ్యుతాపురం, కొనెంపాలెం, కుమారపురం, దుప్పితూరులకు తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు సీపీఎం నివాళులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 : ఇక్కడి సీపీఎం కార్యాలయంలో గురువారం పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. భట్టాచార్య చిత్రపటానికి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్యవర్గసభ్యుడు ఆర్.శంకరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, పెంటకోట శ్రీను, తేలయ్యబాబు, నాయనబాబు, సుభాషిణి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ జాగిలాలతో వాహనాల తనిఖీ


బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి, ఆగస్టు 8 : వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద గురువారం సాయంత్రం స్నిఫర్ డాగ్స్‌తో పోలీసులు పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సన్నిబాబు నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. బస్సులు, కార్లలోవున్న లగేజీలను కూడా పోలీస్ జాగిలాలు తనిఖీ చేశాయి. గంజాయి, నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టాలన్న లక్ష్యంతో ఈ తనిఖీలు చేపట్టినట్టు వారు తెలిపారు.

ఘనంగా 'తోట నగేశ్' జన్మదిన వేడుకలు


తోట నగేశ్‌కు కేక్ తినిపిస్తున్న గంటా శ్రీనివాసరావు

పాయకరావుపేట, ఆగస్టు 8 : జిల్లా గంధ్రాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన పార్టీ నాయకుడు తోట నగేశ్ జన్మదిన వేడుకలు గురువారం పాయకరావుపేటలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి తదితరులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నాలుగు మండలాల పార్టీ శ్రేణులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి, పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జీవీవీ సత్యనారాయణ, అక్కిరెడ్డి వరహాలు, ఇంజరపు సూరిబాబు, దేవాది మంగాదేవి, పెంకే శ్రీను, ఐఎన్.మూర్తి, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

తుమ్మపాల, ఆగస్టు 8 : రైతులు విధిగా ఈ- పంట నమోదును చేయించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ సర్వే అధికారులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్నామని చెప్పారు. ఏవో పి.రంగాచారి మాట్లాడుతూ వ్యవసాయాధికారులుఈ- పంట నమోదును విజయవంతంగా చేపట్టాలని సూచించారు.

సబ్బవరం : ఖరీఫ్‌లో రైతులు వేసే ప్రతి పంటకు ముఖ్యంగా వరికి ఇ-క్రాప్ నమోదు చేయాలని ఏవో పోతల సత్యనారాయణ సూచించారు. గురువారం ఇక్కడ గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, వీఆర్వోలకు ఇ-క్రాప్ నమోదుపై ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ శాఖల రైతుల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ ఇ-క్రాప్‌తో ముడిపడి ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీటీ వెంకట్, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో రామకాసు, మాస్టర్స్ ట్రైనర్స్ వీఏఏలు పోతల అలేఖ్య, బొబ్బరి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల, ఆగస్టు 8: పంటల వివరాలను రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ఏవో భీమిరెడ్డి సరోజని సూచించారు. కోటవురట్ల రైతు సేవా కేంద్రంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బందితో ఇందుకు సంబంధించి ఏర్పాటైన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ నానిబాబు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'హేచరీలలో పాత ఏజెంట్లనే కొనసాగించాలి'

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 8 : పాల్మన్‌పేట పంచాయతీ పరిధిలోని హేచరీలలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న రొయ్య పిల్లల ప్యాకింగ్ ఏజంట్లనే కొనసాగించాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాల్మన్‌పేట పంచాయతీలో సుమారు 26 హేచరీలు ఉన్నాయన్నారు. పాతవారినే కొనసాగించాన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని భార్యకు చుక్కు అందిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 : పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తూ పదవీ విరమణ పొంది మృతి చెందిన జి.శ్రీనివాసరావు కుటుంబానికి జిల్లా ఎస్పీ ఎం.దీపిక తన కార్యాలయంలో గురువారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శ్రీనివాసరావు ఈ ఏడాది మే 12వ తేదీన పదవీ విరమణ చేసి 17వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న హోంగార్డులు అంతా వారి ఒకరోజు డ్యూటీ అలవెన్సును సదరు కుటుంబానికి ఆర్థిక సాయంగా ప్రకటించారు. ఈ మొత్తం రూ.3.8లక్షల పైచిలుకు చెక్కును మృతుడి భార్య తులసీరామలక్ష్మికి ఎస్పీ అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏవో బి.శారదా, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.

'కృష్ణా నదీ జలాల పంపిణీ చేపట్టాలి'

తుమ్మపాల, ఆగస్టు 8 : కృష్ణానదీ జలాలు పునః పంపిణీ చేపట్టి రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. ఈ మేరకు గురువారం రైతు సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఆగస్టు రెండో వారం లోపు ప్రభుత్వం వాదనలతో బ్రిజేష్‌కుమార్ నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణమే ముఖ్యమంత్రి చొరవ తీసుకుని సాగునీటి పంపిణీపై రాష్ట్రాలతో చర్చించి రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించి ముందుకు సాగాలని కోరారు. రైతు సంఘం నాయకులు మర్రిబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, గురుబాబు, కోరిబిల్లి శంకరరావు, పప్పల ఈశ్వరరావు, జి.లక్ష్మి పాల్గొన్నారు.

లాలంకోడూరు సర్పంచ్‌గా గుణాకర్ బాధ్యతలు


గుణాకర్‌కు సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

రాంబిల్లి, ఆగస్టు 8 : మండలంలోని లాలంకోడూరు సర్పంచ్‌గా రుత్తల గుణాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న లాలం రమణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న గుణాకర్ పంచాయతీ కార్యదర్శి నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వైఎస్ ఎంపీపీ కళిరెడ్డి నర్సింగరావు, మాజీ సర్పంచ్ లాలం శైలశిరీషా, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనకాపల్లి మండల సమావేశం రేపు

తుమ్మపాల, ఆగస్టు 8 : అనకాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల పదో తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

మూడు గ్రామాల సరిహద్దు రాయి ఏర్పాటు


సరిహద్దు రాయిని ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం, ఆగస్టు 8 : మండల కేంద్రం సబ్బవరం, అసకపల్లి, గొటివాడ గ్రామాల మధ్య సరిహద్దు రాయిని గురువారం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల ఆరో తేదీన 'భూ బకాసురుడు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వారు వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు ఇరువాడ సర్వే నెంబర్లు 103, 106లలో గెడ్డ వాగులకు సంబంధించి గత రెండు రోజులు ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. గురువారం మూడు గ్రామాల సరిహద్దును గుర్తించి అసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ఆధ్వర్యంలో సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, సిబ్బంది సర్వే చేసి సరిహద్దురాయిని పాతారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రుక్మిణి, విజయశ్రీ, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో వినియోగదారులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఆర్‌బీఐ మేనేజర్ జయలక్ష్మి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మన్ పై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో ఆర్‌బీఐ మేనేజర్ పి.జయలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులకు పలు సూచనలు చేశారు. కోటక్ మహీంద్ర బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ కె.విజయకుమార్, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ రామ్‌కుమార్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళనకు కదిలిన రైతన్న

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలకు చెందిన సుమారుగా 3 వేల ఎకరాల సాగుభూములకు బెన్నవోలు ఆవ పెద్దేరు నదుల నుంచి సాగునీటి కాలువల ద్వారా సాగునీరు అందేది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ సాగునీటి కాల్వలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వ్యవసాయ సీజన్ ముందు సాగునీటి కాలువలు బాగు చేయడం, కాలువల్లో పూడిక తీయడం వంటి పనులు చేపట్టేవారు. దీంతో కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటి భూములకు నీరు సక్రమంగా పారేది. వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగునీటి కాలువల అభివృద్ధికి ప్రతిపాదనలు తప్ప, నిధులు మంజూరు లేకపోవడంతో కాలువలు మరమ్మతుకు నోచుకోక పూడిక పెరిగిపోయి సాగునీరు పారని దుస్థితి నెలకొంది. సాగునీటి కాలువలు బాగు చేయించాలని, పూడిక తీయించాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు సాలాపు నరసింహమూర్తి తదితరులు జలవనరుల శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి, కాగితాలు సమర్పించినా స్పందన కరువైంది.

ఈ ఏడాది వర్షాలు కురిసినప్పటికీ వరినాట్లుకు అవసరమైన సమయంలో వర్షాలు తగ్గడంతో చివరకు రైతులంతా రంగంలో దిగారు. బెన్నవోలు నుంచి జన్నవరం వరకు సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించడం, తుప్పలు తొలగించే పనిని స్వచ్ఛందంగా చేపట్టారు. అధికారులు కనీసం కాలువల నిర్వహణకు కొంత మొత్తం అయినా నిధులు విడుదల చేస్తే తమకు మరింత వెసులుబాటుగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

మేయర్ పీఠంపై గురి!

... 5వ పేజీ తరువాయి

లభించడం ఆ పార్టీ నేతలను షాక్‌కు గురిచేసింది. వైసీపీ శిబిరానికి హాజరైన వారిలో సగం మంది కూటమి అభ్యర్థులకే ఓటేయడంతో వారంతా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. కనీసం 15 మంది కార్పొరేటర్లు త్వరలో టీడీపీ, జనసేనలో చేరిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీని దక్కించుకున్న ఊపులోనే మేయర్ పీఠాన్ని కూడా చేజిక్కించుకోవాలని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు, నేతలు భావిస్తున్నారు. అయితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే కనీసం నాలుగేళ్లు పదవీకాలం పూర్తవ్వాలనే నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో ఆ చట్టాన్ని సవరించాలని ప్రభుత్వంలోని పెద్దలను కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక స్థానిక సంస్థల్లో ఇదే పరిస్థితి ఉన్నందున...అవిశ్వాసానికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే చట్టాన్ని సవరించే అంశాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని కూటమి నేతలు చెబుతున్నారు. మంత్రిమండలి ఆమోదిస్తే వెంటనే గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ జారీచేయించి, తర్వాత జరిగే శాసనసభ సమావేశాల్లో ఆ అంశాన్ని ర్యాటిఫికేషన్ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆర్డినెన్స్ జారీ అయితే వెంటనే కౌన్సిల్ సమావేశం పెట్టి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఖాయమని జీవీఎంసీ అధికారులు కొందరు అభిప్రాయపడుతున్నారు. కౌన్సిల్‌లో ఇప్పటికే కూటమి తిరుగులేని ఆధిక్యం సంపాదించినందున అదేరోజు కొత్త మేయర్‌ను ఎన్నుకోవడం ఖాయమని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఊహించని పరాభవం ఎదురైందనే బాధలో ఉన్న వైసీపీ నేతలు, కార్పొరేటర్లకు మేయర్ మార్పు అంశం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

కనీస పింఛను రూ.10 వేలు చేయాలి

- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వీవీకే రాయ్

నర్సీపట్నం, ఆగస్టు 8 : ఆర్టీసీలో పని చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు వీవీకే రాయ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కృష్ణా కల్యాణ మండపంలో జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రూ2 వేలకు మించి పెన్షన్ రావడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పిల్లల చదువులు, వివాహాలు చేయాలంటే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు కనీసం రూ.10వేలు పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయినఉద్యోగులకు వృద్ధాప్య పెన్షన్, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లాకార్యదర్శి ఏవీ రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు



కృష్ణా దే వి పేట, ఆగస్టు 8 : సీసీరోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాల నిగొలుగొండ మండలం పాత కృష్ణా దే వి పేట ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ స్తంభాల వల్ల రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని అంటున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో ద్విచక్రవాహనలు తప్ప ఆటోలు, ఇతర వాహనాలు వెళ్ళేందుకు వీలులేకుండా పోతోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులిన్న ఆటో వద్దకు తీసుకువెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. సీసీరోడ్డు వేసినప్పటికీ విద్యుత్ స్తంభాలను పక్కకు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రివేళల్లో తమకు తీవ్ర ఇబ్బందులు తప్పటంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనాఅధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెంకునాయుడుపేటలో ట్రాఫిక్ వెతలు

- ఆక్రమణల దెబ్బకు ఇరుకుగా మారిన రోడ్లు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



ద్విచక్ర వాహనాలు సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితి

నర్సీపట్నం, ఆగస్టు 8 : మునిసిపాలిటీ 22 వార్డు వెంకునాయుడులో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్య రద్దీగా ఉండే వెంకునాయుడుపేటలోని మెయిన్ రోడ్డు 12 అడుగులకు మించి ఉండదు. పాల్‌ఘాట్ సెంటర్ నుంచి వీధిలోకి ప్రవేశించే మార్గంలో షాపులు వద్ద బైక్‌లు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వీధిలోకి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంటోందని వాహనదారులు అంటున్నారు. వెంకునాయుడుపేట పేరు చెబితే అద్దె కార్లు తిప్పేవారు 'బాబోయ్... ఆ వీధిలోకి రాలేం' అంటున్నారంటూ పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయవచ్చు. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్‌లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ప్రవేశ మార్గంలో వాహనాలు అడ్డుగా ఉండటం వలన ట్రాఫిక్ నిలిచి పోతోంది. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదన ప్రకారం వీధిలో మెయిన్ రోడ్డు 30 అడుగులు ఉండాలి. పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా స్థాయి పెరిగి పదమూడు సంవత్సరాలు కావస్తున్నా.. వార్డులో రోడ్డు బాగుపడ లేదని ప్రజలు వాపోతున్నారు. పార్కింగ్ స్థలం విడిచి పెట్టకుండా దుకాణాలు నిర్మాణాలు జరిగినా అధికారులు పట్టించు కోలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న 12 అడుగుల రోడ్డులో రెండు వైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోందని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న రోడ్డులో షాపుల నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షణ ఉండటం లేదని విమర్శలు ఉన్నాయి. పాల్‌ఘాట్ సెంటర్ నుంచి బొంతువీధికి వెళ్లే స్థానికులు వెంకునాయుడు పేట మీదుగానే వెళతారు. అబీద్ సెంటర్ నుంచి శారదా గనర్‌కు వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని వెంకునాయుడుపేట రోడ్డుని ఉపయోగిస్తారు. దీంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'పొలంబడి'లో సస్యరక్షణపై రైతులకు అవగాహన

మాకవరపాలెం, ఆగస్టు 8 : ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని పాయకరావుపేట ఏడీఏ కె.ఉమాప్రసాద్ తెలిపారు. గురువారం గిడుతూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు వ్యయప్రయాసలను తగ్గించుకోవచ్చన్నారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అర్హులైన కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులను పొందాలన్నారు.వరి పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల తెగుళ్ల బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, ఏఈవో శేషునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : వరిసాగులో ఎరువుల వినియోగం సమపాళ్లలో వినియోగించాలని నర్సీపట్నం వ్యవసాయశాఖ ఏడీఏ టి.శ్రీదేవి రైతులకు సూచించారు. మండలంలోని గురువారం పాతమల్లంపేటలో పొలంబడి నిర్వహించారు. సాగులో పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుధావాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గొలుగొండ : రైతులను సూచలిస్తున్న ఏడీఏ శ్రీదేవి

ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటండి

నాతవరం, ఆగస్టు 8 : చెత్త సంపద కేంద్రంఆవరణలో కొబ్బరి మొక్కలు పెంచాలని ఎంపీడీవో రాంబాబు ఆదేశించారు. గురువారం ఆయన నాతవరం మండలంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఖాళీగా ఉన్న ఈ స్థలంలో కొబ్బరిమొక్కలు పెంచాలన్నారు. అలాగే కస్తూర్బా పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని తెలుగు పదాలు బోర్డుపై రాయించారు. అయితే చాలామంది విద్యార్థులు తప్పులు రాయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం వీధుల్లో మురుగు కాలువల్లో తీస్తున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ వర్షాకాలంలో గ్రామాల్లో ప్రతి పంచాయతీలోను పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రమణ, డిజిటల్ అసిస్టెంట్ సాయి తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో టీచర్లతో సమావేశమైన ఎంపీడీవో

విచారణకు సర్పంచ్ గైర్హాజరు

మాకవరపాలెం, ఆగస్టు 8 : మండలంలోని జి.కోడూరు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గురువారం విచారణ చేపట్టగా, సర్పంచ్ హాజరు కాలేదు. దీంతో విచారణ సాగలేదు. జి.కోడూరు సర్పంచ్ పంచాయతీ నిధులు పక్కదారి పట్టించారంటూ ఆదే గ్రామానికి చెందిన జగన్నాథరావు (జయబాబు) ఈ నెల 1న ఏపీ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీపీవో శిరీషా రాణి ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. ఇందుకోసం వేరే మండలానికి చెందిన ఈవోపీఆర్డీని విచారణాధికారిగా నియమించారు. అయితే గురువారం చేపట్టిన విచారణకు సర్పంచ్ గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.70 లక్షలను సర్పంచ్ పక్కదారి పట్టించారన్నారు. అందుకే విచారణకు సర్పంచ్ రాలేదన్నారు. గతంలో చేసిన పనులు నిమిత్తం సర్పంచ్ భర్త, అతని మేనల్లుడు పేరు మీద రూ.ఐదేసి లక్షల చొప్పున బిల్లులు స్వాహా చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వారం నుంచి నీరు బంద్

కుమారుపురం వాసుల అవస్థలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 8 : గొలుగొండమండలంలోని సీహెచ్ నాగాపురం పంచాయతీ శివారు కుమారుపురంలో వారం రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. వాటర్‌ట్యాంకు మోటార్ మరమ్మతుకు గురైనప్పటికీ ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేరని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో వంద గడపలు, సుమారు 300 జనాభా ఉన్నారు. వీరికి ఒక్క చేతి బోరు మాత్రమే ఉంది. అది కూడా ప్రస్తుతం సరిగా పని చేయడం లేదు. ఈ సమస్యపై వారం రోజులుగా ఫిర్యాదు చేస్తూనే ఉన్నామని, కానీ పట్టించుకున వారే లేరని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం, ఆగస్టు 8 : పలు గ్రామాలకు శుక్రవార విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణారావు తెలిపారు. మండలంలో 33/11 కేవీ, పరిధిలో 11 కేవీ మాకవరపాలె, తామరం, రాచపల్లి,జంక్షన్, అవంతి కాలేజీ, కొత్తపాలెం, మెడి కాలేజీ నిర్మాణం వరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మత్తులు, చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈ తెలిపారు. వినియోగాదారులు సహకరించాలని కోరారు.

కాలువల ప్రక్షాళనకు కదిలిన రైతన్న

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలకు చెందిన సుమారుగా 3 వేల ఎకరాల సాగు భూములకు బెన్నవోలు ఆవ పెద్దేరు నదుల నుంచి సాగునీటి కాలువల ద్వారా సాగునీరు అందేది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ సాగునీటి కాల్వలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వ్యవసాయ సీజన్ ముందు సాగునీటి కాలువలు బాగు చేయడం, కాలువల్లో పూడిక తీయడం వంటి పనులు చేపట్టేవారు. దీంతో కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటి భూములకు నీరు సక్రమంగా పారేది. వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగునీటి కాలువల అభివృద్ధికి ప్రతిపాదనలు తప్ప, నిధులు మంజూరు లేకపోవడంతో కాలువలు మరమ్మతుకు నోచుకోక పూడిక పెరిగిపోయి సాగునీరు పారని దుస్థితి నెలకొంది. సాగునీటి కాలువలు బాగు చేయించాలని, పూడిక తీయించాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు సాలాపు నరసింహమూర్తి తదితరులు జలవనరుల శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి, కాగితాలు సమర్పించినా స్పందన కరువైంది. ఈ ఏడాది వర్షాలు కురిసినప్పటికీ వరినాట్లుకు అవసరమైన సమయంలో వర్షాలు తగ్గడంతో చివరకు రైతులంతా రంగంలో దిగారు. బెన్నవోలు నుంచి జన్నవరం వరకు సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించడం, తుప్పలు తొలగించే పనిని స్వచ్ఛందంగా చేపట్టారు. అధికారులు కనీసం కాలువల నిర్వహణకు కొంత మొత్తం అయినా నిధులు విడుదల చేస్తే తమకు మరింత వెసులుబాటుగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

మేయర్ పీఠంపై గురి!

... 5వ పేజీ తరువాయి

లభించడం ఆ పార్టీ నేతలను షాక్‌కు గురిచేసింది. వైసీపీ శిబిరానికి హాజరైన వారిలో సగం మంది కూటమి అభ్యర్థులకే ఓటేయడంతో వారంతా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. కనీసం 15 మంది కార్పొరేటర్లు త్వరలో టీడీపీ, జనసేనలో చేరిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీని దక్కించుకున్న ఊపులోనే మేయర్ పీఠాన్ని కూడా చేజిక్కించుకోవాలని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు, నేతలు భావిస్తున్నారు. అయితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో ఆ చట్టాన్ని సవరించాలని ప్రభుత్వంలోని పెద్దలను కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక స్థానిక సంస్థల్లో ఇదే పరిస్థితి ఉన్నందున..అవిశ్వాసానికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే చట్టాన్ని సవరించే అంశాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని కూటమి నేతలు చెబుతున్నారు. మంత్రిమండలి ఆమోదిస్తే వెంటనే గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ జారీచేయించి, తర్వాత జరిగే శాసనసభ సమావేశాల్లో ఆ అంశాన్ని ర్యాటిఫికేషన్ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆర్డినెన్స్ జారీ అయితే వెంటనే కౌన్సిల్ సమావేశం పెట్టి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఖాయమని జీవీఎంసీ అధికారులు కొందరు అభిప్రాయపడుతున్నారు. కౌన్సిల్‌లో ఇప్పటికే కూటమి తిరుగులేని ఆధిక్యం సంపాదించినందున అదేరోజు కొత్త మేయర్‌ను ఎన్నుకోవడం ఖాయమని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఊహించని పరాభవం ఎదురైందనే బాధలో ఉన్న వైసీపీ నేతలు, కార్పొరేటర్లకు మేయర్ మార్పు అంశం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.



ఘనంగా మరిడితల్లి పండగ



బుచ్చెయ్యపేట, ఆగస్టు 8 : రాజాం గ్రామంలో మరిడితల్లి పండగను టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో నాయకులు అమ్మవారి మొక్కలు తీర్చుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రావికమతం మండల టీడీపీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు మజ్జి అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆ పది గ్రామాలకు 24 గంటల్లో సాగునీరు : ఎమ్మెల్యే బండారు

చీడికాడ, ఆగస్టు 8 : మర్లగుమ్మి ఆనకట్ట పరిధిలోని పది గ్రామాలకు 24 గంటల్లోగా సాగునీరు అందించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధికారులను ఆదేశించారు. 'కొనసాగుతున్న కష్టాలు' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన వెను వెంటనే స్పందించారు. ఈ మేరకు మర్లగుమ్మి ఆనకట్ట పరిధిలోని చీడికాడ దోకలవారి కళ్లాల వద్ద నిర్మిస్తున్న కాలిబాట వంతెనకింద కాలువలో పేరుకుపోయిన మట్టి ప్రదేశాన్ని గురువారం నీటిపారుదల శాఖ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ వంతెన నిర్మాణానికి గల కారణాలను అక్కడి రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ వంతెన ద్వారా వర్షపునీరు చెరువులోకి వెళుతుందని రైతులు వివరించారు. నీరు వెళ్లే ప్రదేశాన్ని, మదుమును ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీన కోనాం జలాశయం నుంచి సాగునీరు విడుదల చేసినా అధికారుల నిర్లక్ష్యం వలన ఇంతవరకూ మర్లగుమ్మి ఆనకట్ట పరిధిలోని పది గ్రామాలకు సాగునీరు అందలేదన్నారు. ఈ కాలువలో పేరుకుపోయిన మట్టిని దగ్గరుండి తొలగించి, 24గంటల్లో అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని సూచించారు. నీటిపారుదల శాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడు, ఏఈఈ సిహెచ్.జయరాంపడాల్, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, కోనాం జలాశయం మాజీ చైర్మన్ గండి ముసలినాయుడు, వ్యవసాయ సలహాకమిటీ మాజీ చైర్మన్ యర్రా అప్పారావు, ఎంపీటీసీలు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

15న మాడుగులలో రక్తదాన శిబిరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బండారు, తదితరులు

మాడుగుల, ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాడుగులలో భారత నిర్మాణ సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి గురువారం ఆవిష్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, పి.సూర్యనారాయణరాజు, జనసేన నాయకులు రొబ్బా మహేష్, ట్రస్టు సభ్యులు గౌరీపట్టపు మహేష్ కుమార్, చక్రధరమహంతి మధు, పొట్నూరి కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

'చెరకు రైతులకు సబ్సిడీపై పురుగు మందులు'

చోడవరం, ఆగస్టు 8 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని సభ్య రైతులకు సబ్సిడీ ధరలపై పురుగుమందులు సరఫరా చేయనున్నట్టు చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు వేల ఆరువందల బ్యాగులు గెమాక్సిన్ మందు అందుబాటులో ఉందన్నారు. గతంలో పది కిలోల బ్యాగు పరిమాణంలో అందించే వారమని, అది కొంత మేర వృథా అయ్యేదని తెలిపారు. దీంతో ఈ ఏడాది ఐదు కిలోల బ్యాగులు సిద్ధం చేసినట్టు చెప్పారు. గతంలో పది కిలోల బ్యాగు రూ.248లకు ఇచ్చేవారని, ఈ ఏడాది ఐదు కిలోల బ్యాగు తగ్గింపు ధరలో రూ.101లకు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. అలాగే మోనోక్రోన్ పావులీటరు రూ.96లకు రైతులకు అందుబాటులో ఉందని వివరించారు.

చుక్కపల్లిలో పశువులపాక దగ్ధం

చీడికాడ, ఆగస్టు 8 : చుక్కపల్లిలో మజ్జి అప్పారావుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. దీంతో సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లింది. రైతులంతా గురువారం ఉదయం పొలం పనుల్లోకి వెళ్లిపోయిన తరువాత సుమారు 11.30గంటలకు ప్రమాదవశాత్తు పాకకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఆ పక్కనే ఉన్న ధాన్యం గడ్డిమేటు కాలిపోవడంతో అందులోని పది బస్తాల ధాన్యం బూడిదయ్యాయి.



17న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

చోడవరం, ఆగస్టు 8 : పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఈనెల 17న నిర్వహించనున్నట్టు ఎంఈవో కె.సింహాచలం తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఎన్నికల కమిటీ రీ షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. వాస్తవానికి గురువారం ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. ఎన్నికల నిర్వహణకు అధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో తాజాగా షెడ్యూల్ ప్రకటించారు. ఈ ప్రకారం ఈనెల 12న ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, 17న ఎన్నిక ఉంటుందని ఎంఈవో వివరించారు.

12న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చోడవరం, ఆగస్టు 8 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 12న స్థానిక ప్రేమసమాజం ఆవరణలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రేమసమాజం ఇన్‌చార్జి సీహెచ్.ప్రసాదరాజు తెలిపారు. రిటైర్డ్ హెచ్ఎం సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదోతరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

'ఈ-శ్రమ్ కార్డుతో కార్మికులకు భరోసా'

చోడవరం, ఆగస్టు 8 : కేంద్ర ప్రభుత్వ పథకం ఈ-శ్రమ్ కార్డు ఉన్న కార్మికుడు ప్రమాదవశాత్తూ మృతిచెందితే అతని కుటుంబానికి రూ. రెండు లక్షల బీమా పరిహారం లభిస్తుందని స్థానిక సహాయ కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని నరసయ్యపేటకు చెందిన కార్మికుడు ముమ్మన శ్రీనివాసరావు ప్రమాదంలో మృతిచెందడంతో అతని కుటుంబానికి మంజూరైన చెక్కును గురువారం అందజేసి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొసర తాతారావు, గౌరునాయుడు, ఆకుల దేముడు, జనపరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

చీడికాడ, ఆగస్టు 8: గ్రామీణులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. చీడికాడ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఏఈలు శ్రీకాంత్, సూరిబాబు, పరదేశినాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

దేవరాపల్లి, ఆగస్టు 8 : ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ దేవరాపల్లి మండల శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈవోలు పడాల దాస్, ఉషారాణిలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పెద్దాల వెంకటరమణ, ప్రకాశ్‌బాబు, ఎర్రయ్యదొర, ఆనంద్ పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్‌లో చేర్చాలి



ఎం.గదబూరులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

మాడుగుల, ఆగస్టు 8 : ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నర్సింహ మూర్తి కోరారు. మాడుగుల పంచాయతీ శివారు ఎం.గదబూరులో గురువారం అక్కడి గిరిజనులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 320 ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్‌లో కలపకపోవడం వల్ల అక్కడి భూములకు, అటవీ సంపదకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. గిరిజనేతర పెత్తందారులు, మైనింగ్ మాఫియా మధ్య ఆదివాసీ గిరిజనులు నలిగిపోతున్నారన్నారు. పైగా ఐటీడీఏ నుంచి వచ్చే అభివృద్ధి పథకాలు అందడం లేదన్నారు. దీనిపై కూటమి నాయకులు వెంటనే స్పందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేయాల్సిందిగా విన్నవించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో టోకూరు చిలుకమ్మ, ఓంద్రు కొండమ్మ, పిల్లి ఎర్రయ్యమ్మలతో పాటు పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎఐ అప్పలనాయుడు

రావికమతం, ఆగస్టు 8 : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కొత్తకోట సీఐ అప్పలనాయుడు అన్నారు. మత్తుపదార్థాల వల్ల అనర్థాలపై కొత్తకోట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితమే నాశనం అవుతుందన్నారు. అంతా శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

దేవరాపల్లి, ఆగస్టు 8 : దేవరాపల్లి తహసీల్దార్ ఎం.లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు ఇక్కడ పనిచేసిన ఈమెను ఎన్ని కల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు పంపారు. ఎన్ని కల ప్రక్రియ పూర్తికావడంతో తిరిగి తహసీల్దార్‌ను ఇక్కడకు పంపడంతో ఆమె విధుల్లో చేరారు. వీఆర్‌వోలతో పాటు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

రావికమతం : ఇక్కడి తహసీల్దార్‌గా ఎస్‌ఏ మహేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి ఇతనిని శ్రీకాకుళం పంపారు. ఎన్నికలు పూర్తికావడంత మళ్లీ ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడంతో విధుల్లో చేరారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్, ఆగస్టు 8 : కేజేపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈఈ రాంబాబు తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కేజేపురం, వంటర్లపాలెం, ముకుందపురం, వీరవిల్లి అగ్రహారం, పోతనపూడి అగ్రహారం గ్రామాలకు సరఫరా ఉండదని వివరించారు.

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంట ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం రోలుగుంటతో పాటు కొవ్వూరు సన్ ఫుడ్ కార్పొరేషన్ బిట్ లైన్, ఓలం ఫ్యాక్టరీ లైను, స్టోన్ క్రషర్ల లైనులలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ రామకృష్ణారావు తెలిపారు.

